# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 67 | ఆదివారం 09, నవంబర్ 2025 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com




## రేవంత్‌కు ఓటమి భయం

ఆయన ఒత్తిడిలో ఉన్నారు..

బీజేపీ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

మీ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీజేపీపై నిందలా అని ఆగ్రహం

పుట్టిన రోజు సందర్భంగా ప్రజలకు ఇచ్చే బహుమతి ఏమిటో చెప్పాలన్న లక్ష్మణ్

02



## రేవంత్ నన్ను తిట్టినప్పుడు కేసీఆర్ ఫోన్ చేసి ఆ మాట చెప్పారు: కేటీఆర్

రేవంత్ రెడ్డి ఒత్తిడిలో ఉన్నారని, ఓడిపోతున్నాడని తెలిసి నిరాశలో ఉన్నాడని కేసీఆర్ చెప్పారన్న కేటీఆర్

సంయమనంతో మాట్లాడాలని కేసీఆర్ తనకు సూచించారన్న కేటీఆర్

05




# ఆర్జేడీకి ఓటేస్తే.. ఆటవిక రాజ్యమే

### మేము ల్యాప్‌టాప్‌లు ఇస్తే, వాళ్లు రివాల్వర్లు ఇస్తారు

ఆర్జేడీ గెలిస్తే బీహార్‌లో రౌడీ రాజకీయాలు

ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు

జంగల్ రాజ్ తిరిగి తెచ్చేందుకు ఆర్జేడీ యత్నం

ఇండీ కూటమిపై ప్రధాని నరేంద్రమోడీ విమర్శలు

హైదరాబాద్, ప్రజాస్వరం

బిహార్‌లో రెండో దశ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సమీపిస్తోంది. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు ప్రచార వేగం పెంచాయి. ముఖ్యంగా సీతామర్హి, మధుబనీ, దర్భంగా ప్రాంతాల్లో ప్రధాన పార్టీల నేతలు ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాల్లో మునిగిపోయారు. శనివారం సీతామర్హిలో ఎన్నికల బహిరంగ సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 'బిహార్ ప్రజలకు మేము ల్యాప్‌టాప్‌లు ఇస్తాం, వాళ్లు రివాల్వర్లు ఇస్తారు.' అంటూ మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. బిహార్ విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం కంప్యూటర్లు, క్రీడా సామగ్రి, ఫుట్‌బాల్, హాకీ స్టిక్‌లు అందిస్తున్నప్పుడు, ప్రతిపక్ష ఆర్జేడీ మాత్రం తుపాకుల గురించి మాట్లాడుతుందన్నారు. "బిహార్ ప్రజలు తుపాకుల ప్రభుత్వాన్ని కోరుకోవడం లేదు. వారు అభివృద్ధి కోరుకుంటున్నారు. నూతన అవకాశాలు కోరుకుంటున్నారు. కానీ ఆర్జేడీ మాత్రం పాత జంగిల్‌రాజ్‌ను తిరిగి తెచ్చే ప్రయత్నం చేస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్జేడీ ఎన్నికల సభల్లో వినిపిస్తున్న నినాదాలే వారి ఉద్దేశాన్ని చెబుతున్నాయని మోదీ మిగతా 2లో..

## రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్

హామీలు అమలుచేయకుండా తప్పుడు ప్రచారమా?

బీఆర్ఎస్‌తో లాలూచీ పడాల్సిన అవసరం మాకేంటి?

ఇతర పార్టీలను దూషించడమే సీఎం పనిగా పెట్టుకున్నాడు

హైకమాండ్ కు భయపడి కేసీఆర్ మీద చర్యలు తీసుకోవడం లేదు

ముఖ్యమంత్రి ఆరోపణలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కౌంటర్

హైదరాబాద్, ప్రజాస్వరం

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి విఫలమయ్యారని జీ. కిషన్‌రెడ్డి మండిపడ్డారు. "ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ ఇప్పుడు పక్కనపెట్టి, మళ్లీ మళ్లీ ఇతర పార్టీలను దూషించడం మాత్రమే రేవంత్ రెడ్డి పని అయింది" అని ఆయన విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ "ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీ ఇప్పుడు కాంగ్రెస్‌కు భారంగా మారింది. గ్యాస్ సిలిండర్ ధర తగ్గిస్తామని చెప్పారు, ఏమైంది? మిగతా 4లో..





## అక్రమవలసదారులను తరిమికొడతాం

తేజస్వీ యాదవ్, రాహుల్ గాంధీ కుట్రదారులు

లాలూ అవినీతి గురించి దేశమంతా తెలుసు

బీహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు చేసి తీరుతాం

ఎన్నికల ప్రచారసభలో కేంద్ర మంత్రి అమిత్ షా

హైదరాబాద్, ప్రజాస్వరం

కేంద్ర మంత్రి అమిత్ షా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బిహార్‌లోని పూర్ని యాలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ, "సీమాంచల్ ప్రాంతాన్ని చొరబాటుదారుల కేంద్రంగా మార్చాలన్న కుట్రలో రాహుల్, తేజస్వీలు భాగస్వాములయ్యారు" అని ఆరోపించారు. ప్రతి అక్రమ వలసదారుడిని గుర్తించి దేశం నుంచి పంపించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తాజాగా తేజస్వీ యాదవ్ చేసిన వ్యాఖ్యలకు స్పందించిన షా, "ఏడు జన్మలెత్తినా లాలూ మాదిరిగా మోదీ అవినీతిలో మునిగిపోరని దేశ ప్రజలు బాగా తెలుసు" అని ప్రతిఘటించారు. బిహార్‌లో 160 స్థానాల్లో విజయం సాధించి ఎన్డీయే మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. "రాష్ట్ర ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్-ఆర్జేడీ కూటమికి తలుపులు మూసేశారు" అని అన్నారు.

ఇక కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఓట్ల చోరీ ఆరోపణలను మిగతా 2లో..



## సబ్బండ కులాల మద్దతు నవీన్ యాదవ్ కే

నవీన్ యాదవ్ ను గెలిపించి బీసీల రాజకీయ ఐక్యతను చాటాలి

జూబ్లీహిల్స్ ఎన్నికలలో ఎగిరేది బీసీల జెండానే

రాష్టంలో బీసీల రాజకీయ శకం ఆరంభమవుతుంది

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

02

## గ్రామీణ రోడ్ల రూపురేఖలు మారుస్తాం

హ్యామ్ విధానంలో రోడ్ల నిర్మాణం

రూ.11,399 కోట్లతో వీటిని నిర్మిస్తాం

త్వరలో టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తాం

రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్, ప్రజాస్వరం

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ రహదారుల అభివృద్ధికి భారీ ప్రణాళికలు సిద్ధమయ్యాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. హ్యామ్ విధానంలో రూ.11,399 కోట్ల విలువైన రోడ్ల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు మిగతా 2లో..



## జూబ్లీహిల్స్‌లో 144 సెక్షన్

హైదరాబాద్ సీపీ కీలక ఆదేశాలు

జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై పోలీసుల ప్రత్యేక ఆంక్షలు

మద్యం దుకాణాలు, హోటళ్లు మూసివేత

పోలింగ్ కేంద్రాల వద్ద ఐదుగురికి మించి గుమికూడొద్దు

ఓట్ల లెక్కింపు రోజు టపాసులు పేల్చడంపై నిషేధం

02

## మహారాష్ట్రలో మరో భారీ కుంభకోణం

ప్రతాప్ సర్‌నాయక్‌పై ఆరోపణలు

200 కోట్ల విలువైన భూమి 3 కోట్లకే దక్కించుకున్న మంత్రి

కాంగ్రెస్ పార్టీ, విపక్షాల ఆరోపణలు

చిక్కుల్లో ఫడ్నవీస్ ప్రభుత్వం

ఇప్పటికే అజిత్ పవార్‌పై ఆరోపణలు



హైదరాబాద్, ప్రజాస్వరం

భూమి కుంభకోణాలతో మహారాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కాయి. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు కొత్తగా ఆరోపణలు గుప్పిస్తున్నాయి. ఇప్పటికే అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్‌పై రూ.18,000 కోట్ల విలువైన భూమి విక్రయంపై ఆరోపణలు రాగా.. ఇప్పుడు రాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్‌నాయక్‌పై రూ.200 కోట్ల విలువైన భూమిని రూ.3 కోట్లకే దక్కించుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఈ విషయాన్ని మీడియా ముందుంచగా, ప్రభుత్వ మంత్రి చంద్రశేఖర్ బవాంకులే స్పందించారు. ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మీరా భయందర్ ప్రాంతంలో జరిగినట్లు చెప్పబడుతున్న ఈ భూమి డీల్ మరో ఉదాహరణగా మారింది. కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు విజయ్ వడెట్టివార్ మీడియాతో మాట్లాడుతూ, "ప్రతాప్ సర్‌నాయక్ మీరా భయందర్‌లో దాదాపు 200 కోట్ల రూపాయల విలువైన నాలుగు ఎకరాల భూమిని కేవలం 3 కోట్ల రూపాయలకు కొనుగోలు చేశారు. ఆ భూమిపై ఆయన తన మిగతా 2లో..



# గ్రామీణ రోడ్ల రూపురేఖలు మారుస్తాం

మొదటిపేజీ తరువాయి

తెలిపారు. ఈ ప్రాజెక్టుల కోసం టెండర్ల ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి రూ.60,799 కోట్లతో రహదారుల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం లభించడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడం, పల్లెపట్టణాల మధ్య కనెక్టివిటీ పెంచడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభిస్తుందని వివరించారు. "ప్రతి గ్రామానికి మంచి రహదారి ఉండాలి అన్నదే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి. అదే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది" అని కోమటిరెడ్డి అన్నారు. ఇక జాతీయ రహదారుల విస్తరణ పనులపై మాట్లాడుతూ, రూ.10,400 కోట్ల వ్యయంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని 8 లైన్లకు విస్తరించనున్నట్లు తెలిపారు. దీతో ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని, రహదారి సురక్షితత పెరుగుతుందని వివరించారు. అదేవిధంగా, రూ.36 వేల కోట్లతో ఔటర్ రింగ్ రోడ్‌కు ప్రత్యామ్నాయంగా కొత్త రహదారి - ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం చేపడతామని మంత్రి వెల్లడించారు. ఈ రింగ్ రోడ్ నిర్మాణం పూర్తయ్యాక హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల అభివృద్ధి వేగవంతమవుతుందని అన్నారు. "రోడ్ల అభివృద్ధి రాష్ట్ర ఆర్థిక పురోగతికి ప్రాణధార. రైతులు, వ్యాపారులు, విద్యార్థులు అందరికీ సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించడమే మా లక్ష్యం" అని మంత్రి అన్నారు. ఈ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాబోయే నెలల్లో మరిన్ని రోడ్ల పనులకు పునాది వేస్తామని, పల్లెల రహదారులు పట్టణాల స్థాయిలో మారే రోజులు దూరంలో లేవని మంత్రి నమ్మకం వ్యక్తం చేశారు.



# అక్రమవలసదారులను తరిమికొడతాం

మొదటిపేజీ తరువాయి

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తిప్పికొట్టారు. బిహార్‌లోని రోహ్‌తాస్‌లో ప్రచార సభలో మాట్లాడుతూ, "అలాంటి ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవు. ఉంటే ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాలి'' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ కులం, మతం పేరుతో ప్రజలను విభజించే రాజకీయాలు చేస్తోందని ఆయన విమర్శించారు.



# రేవంత్‌కు ఓటమి భయం

- ఆయన ఒత్తిడిలో ఉన్నారు..
- బీజేపీ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్
- మీ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీజేపీపై నిందలా అని ఆగ్రహం
- పుట్టిన రోజు సందర్భంగా ప్రజలకు ఇచ్చే బహుమతి ఏమిటో చెప్పాలన్న లక్ష్మణ్

హైదరాబాద్, ప్రజాస్వరం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, అందుకే బీజేపీపై నిందలు వేస్తూ అసత్య ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. రేవంత్ రెడ్డి మాటల్లో ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బీజేపీపై నిందలు వేస్తారా అని ప్రశ్నించారు. ఇంటికో ఉద్యోగం అంటూ బీహార్‌లో మీ మిత్రుడు తేజస్వీ యాదవ్ హామీ ఇచ్చారని, ఏడు కోట్ల మంది ఉన్న ఆ రాష్ట్రంలో ఆ హామీ సాధ్యమేనా అని ఆయన నిలదీశారు. రేవంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ప్రజలకు ఇచ్చే బహుమతి ఏమిటో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చెట్టాపట్టాలు వేసుకుని అధికారాన్ని పంచుకున్నాయని ఆయన ఆరోపించారు. 20 శాతం ఓట్ల కోసం దిగజారి మాట్లాడితే 80 శాతం ఉన్న ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. పాముకు పాలు పోసి పెంచినట్లు పాతబస్తీలో మజ్లిస్ పార్టీకి అవకాశమిస్తే ఈరోజు విషనాగులా తయారైందని ఆయన విమర్శించారు.

# సబ్బండ కులాల మద్దతు నవీన్ యాదవ్‌కే

- నవీన్ యాదవ్ ను గెలిపించి బీసీల రాజకీయ ఐక్యతను చాటాలి
- జూబ్లీహిల్స్ ఎన్నికలలో ఎగిరేది బీసీల జెండానే
- రాష్టంలో బీసీల రాజకీయ శకం ఆరంభమవుతుంది
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, ప్రజాస్వరం



ప్రస్తుతం జరిగే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన నవీన్ యాదవ్ కు సబ్బండ కులాల మద్దతు ఉంటుందని, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలు ఈ ఎన్నికల్లో ఓట్ల సునామీ సృష్టించి నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించి బడుగుల రాజకీయ ఐక్యతను చాటాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోని బడుగు బలహీన వర్గాల ప్రజలకు పిలుపునిచ్చారు నేడు హైదరాబాద్ లోని బీసీ భవన్ కు జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతు ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నేతలు మైనింగ్ కార్పోరేషన్ చైర్మన్ ఇరావతి అనిల్ కుమార్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, సీనియర్ నేత డాక్టర్ వినయ్ కుమార్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ లు బిసి భవన్ కు వచ్చి బీసీ సంఘాల నేతలతో భేటీ అయ్యారు ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఎన్నికలలో బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు బీసీలకు టికెట్ లు ఇవ్వలేదని, కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే బీసీ అభ్యర్థి కి టికెట్ ఇచ్చామని, ఈ విషయంలో బీసీ సంఘాలు, కుల సంఘాలు, మేధావులు, విద్యావంతులు సమస్త బీసీ ప్రజలు నవీన్ యాదవ్ కు మద్దతిచ్చి బీసీ బిడ్డ గెలుపు కోసం బీసీ సంఘాలు మద్దతు తెలుపాలని,బిసి అభ్యర్థి గెలుపు కు కలిసి రావాలని వారు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి మేరకు జూబ్లీహిల్స్ ఎన్నికల బరిలో ఉన్న ఏకైక బీసీ అభ్యర్థి నవీన్ యాదవ్ కి తెలంగాణ రాష్ట్రం లోని 136 కుల సంఘాలు, 30 బీసీ సంఘాలు, 12 ఉద్యోగ సంఘాల తో పాటు సబ్బండ కులాలు మద్దతు తెలుపుతున్నామని, నవీన్ యాదవ్ ను గెలిపించడం ద్వారా బీసీల రాజకీయ అధికారానికి తెలంగాణ రాష్ట్రంలో దారులు ఏర్పడతాయని, నవీన్ యాదవ్ గెలుపు బడుగుల రాజకీయాలకు మలుపు అని ఆయన పేర్కొన్నారు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలంతా జూబ్లీహిల్స్ ఎన్నికలలో రాజకీయ విజ్ఞతతో వ్యవహరించి బీసీ అభ్యర్థి ని గెలిపించడం ద్వారా రాష్ట్రంలో బీసీల రాజకీయ శకం ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు బీసీ అభ్యర్థిని బడుగు బలహీన వర్గాలంతా ఐక్యమై గెలిపిస్తే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బీసీ ఎమ్మెల్యేల సంఖ్య 20 మందికి పెరుగుతారని, మంత్రి వర్గంలో బీసీల సంఖ్య పెరుగుతుందని తద్వారా 2028 లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలనే గెలుపు గుర్రాలుగా భావిస్తూ టికెట్లు ఇవ్వడానికి పోటీ పడతాయని ఆయన అన్నారు. బీసీలను గెలిపిస్తేనే బీసీల సకల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధించగలుగుతామని, అన్ని విషయాలను బీసీలు పరిగణలో తీసుకొని ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన బీసీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు జాజుల శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యాము కురుమ, గంగపుత్ర సంఘం అధ్యక్షులు ధీటీ మల్లయ్య, బీసీ జాగృతి అధ్యక్షులు కేపీ మురళీకృష్ణ, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కవుల జగన్నాథం, సంచార జాతుల సంఘం అధ్యక్షులు కోల శ్రీనివాస్ పూసల, గంగిరెద్దుల సంఘం అధ్యక్షులు జిల్లెల నరసింహ, అరెకటిక సంఘం అధ్యక్షులు అఖిల్ కాలి సురేందర్ జి, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రాచమల్ల బాలకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వరికుప్పల మధు, బలహీన వర్గాల ఐక్యవేదిక అధ్యక్షులు లచ్చ గౌడ్, ఓయూ జేఏసీ అధ్యక్షులు బొల్లెపల్లి స్వామి, బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మాదేశి రాజేందర్, ముదిరాజ్ సంఘం నాయకులు దేగల శ్రీనివాస్, గూడూరు భాస్కర్ మేరు, మేడోజు శంకరాచారి, తాటికొండ శ్రీనివాసచారి, వలబోజు నరసింహాచారి, యాదవ సంఘం నాయకులు విజయభాస్కర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు

# మహారాష్ట్రలో మరో భారీ కుంభకోణం

మొదటిపేజీ తరువాయి

విద్యాసంస్థను ఏర్పాటు చేశారు. ఇది స్పష్టమైన అవినీతి అని ఆరోపించారు. వడెట్టివార్ మాట్లలో, "ప్రభుత్వ మంత్రులు ప్రజల ఆస్తిని తమ పాకెట్లలోకి పోసుకుంటున్నారు. ఇలాంటి కుంభకోణాలు ఆగాలంటే, ప్రతిపక్షాలు మాత్రమే కాకుండా, ప్రజలు కూడా మొహర్ పెట్టాలి" అని సవాలు విసిరారు. ఈ ఆరోపణలకు తక్షణమే స్పందించిన మహారాష్ట్ర రెవెన్యూ మంత్రి చంద్రశేఖర్ బవాంకులే, "ఈ విషయాన్ని నేను కూడా విన్నాను. కానీ, ఇప్పటివరకు ఎవరి నుంచైనా అధికారిక ఫిర్యాదు అందలేదు. ప్రతిపక్షాలు మీడియా ముందు వచ్చి ఆరోపణలు చేయడానికి సమయం కేటాయిస్తున్నారు, కానీ అధికారికంగా మా వద్ద ఫిర్యాదు చేయడానికి ఎందుకు ముందుకు రావట్లేదు?" అని ప్రశ్నించారు. మంత్రి మాట్లలో, "ఏదైనా ఫిర్యాదు అందితే, మేము తప్పకుండా దర్యాప్తు చేసి, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటాము. ప్రభుత్వం అవినీతికి మాత్రమే కాకుండా, రాజకీయ ఆరోపణలకు కూడా ఎదుర్కొని నిర్ధారణ చేస్తుంది" అని తేల్చారు. ఈ ఆరోపణలు, ఇటీవల వెలుగులోకి వచ్చిన పార్థ్ పవార్



భూమి కుంభకోణంతో ముడిపడి ఉన్నాయి. ప్రతిపక్షాలు ఆరోపించినట్లుగా, పార్థ్ పవార్‌కు చెందిన 'అమెడియా ఎంటర్‌ప్రైజెస్' సంస్థకు రూ.18,000 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కేవలం రూ.300 కోట్లకు విక్రయించారని చెబుతున్నారు. ఈ ఆరోపణలు తీవ్రంగా పరిగణించిన ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఈ కేసుపై దర్యాప్తుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. "దోషులు ఎవరైనా ఉంటే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము. ప్రభుత్వం పారదర్శకతకు కట్టుబడి ఉంటుంది" అని ఫడణవీస్ స్పష్టం చేశారు. ప్రతాప్ సర్‌నాయక్, మహారాష్ట్రలో పర్యాటక మంత్రిగా పనిచేస్తున్నారు మరియు బీజేపీ సీనియర్ నేతగా పేరు గాంచుకున్నారు. మీరా భయందర్ ప్రాంతం, ముంబైకి సమీపంలో ఉండటం వల్ల భూమి విలువలు భారీగా ఉంటాయి. ఈ భూమి కొనుగోలు 2010లలో జరిగినట్లు చెప్పబడుతున్నప్పటికీ, ఇప్పుడు వెలుగులోకి వచ్చిన ఆరోపణలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కాంగ్రెస్ మరియు ఇతర ప్రతిపక్షాలు, "ఈ కుంభకోణాలు మహాయుతి ప్రభుత్వంలోని అవినీతి స్వచ్ఛందంగా జరుగుతున్నాయి" అని విమర్శిస్తున్నాయి. ఈ సంఘటనలు, మహారాష్ట్రలో రాజకీయ ఉద్రిక్తతను మరింత పెంచుతున్నాయి. పార్థ్ పవార్ కేసుపై దర్యాప్తు బృందం ఏమి నివేదిక ఇస్తుందో చూడాలి. అదే విధంగా, ప్రతాప్ సర్‌నాయక్ ఆరోపణలపై అధికారిక ఫిర్యాదు వస్తుందా? లేక మరో రాజకీయ ఆయుధంగా మిగిలి ఉంటుందా? రాష్ట్ర రాజకీయాల్లో అందరి కళ్లు ఈ దిశగా మళ్లుతున్నాయి.



# జూబ్లీహిల్స్‌లో 144 సెక్షన్

- హైదరాబాద్ సీపీ కీలక ఆదేశాలు
- జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై పోలీసుల ప్రత్యేక ఆంక్షలు
- మద్యం దుకాణాలు, హోటళ్లు మూసివేత
- పోలింగ్ కేంద్రాల వద్ద ఐదుగురికి మించి గుమికూడొద్దు
- ఓట్ల లెక్కింపు రోజు టపాసులు పేల్చడంపై నిషేధం

హైదరాబాద్, ప్రజాస్వరం

జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నికను పురస్కరించుకుని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు వీలుగా నియోజకవర్గ వ్యాప్తంగా కఠిన ఆంక్షలు విధిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఉపఎన్నిక పోలింగ్ సందర్భంగా ఈ నెల 9వ తేదీ (ఆదివారం) సాయంత్రం 6 గంటల నుంచి 11వ తేదీ (మంగళవారం) సాయంత్రం 6 గంటల వరకు నియోజకవర్గం పరిధిలోని అన్ని మద్యం దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, క్లబ్బులను పూర్తిగా మూసివేయాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు జరగనున్న 14వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 15వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఈ ఆంక్షలు మళ్లీ అమల్లో ఉంటాయని వివరించారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటంపై నిషేధం విధించారు. అదేవిధంగా, ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు బహిరంగ ప్రదేశాల్లో, రహదారులపై టపాసులు పేల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం వంటి వాటిపై నిషేధం ఉంటుందని తెలిపారు. పోలీసు ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు.




# ఆర్జేడీకి ఓటేస్తే ఆటవిక రాజ్యమే

మొదటిపేజీ తరువాయి

మండిపడ్డారు. "వారి వేదికలపై అమాయక పిల్లలను తీసుకువచ్చి, దోపిడీదారులుగా మారాలనుకుంటున్నామా అని బలవంతం చేస్తున్నారు. బిహార్ పిల్లలు డాక్టర్లు అవ్వాలా? దోపిడీదారులా? మన భవిష్యత్తును చెడగొట్టే వారిని గెలిపిస్తామా?" అని ఆయన ప్రశ్నించారు. మోదీ మాట్లాడుతూ, "ఆర్జేడీ, కాంగ్రెస్‌లకు ఇండస్ట్రీలో ఏ, బీ, సీ, డీలు కూడా తెలియవు. కానీ పరిశ్రమలను ఎలా మూసేయాలో మాత్రం బాగా తెలుసు. జంగిల్‌రాజ్ పాలనలో బిహార్ వెనక్కి వెళ్లిపోయింది. ఆ 15 ఏళ్లలో ఒక పెద్ద ఆసుపత్రి కానీ, వైద్య కళాశాల కానీ ఏర్పాటుచేయలేదు. కానీ ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక బిహార్‌లో మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి" అని వివరించారు. తన ప్రభుత్వంలో బిహార్ అభివృద్ధి దిశగా పయనిస్తోందని, పెట్టుబడిదారులు ఇప్పుడు రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నారని మోదీ అన్నారు. "మేము బిహార్ యువతకు ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తున్నాం. ఇక్కడి ప్రజలకు కోల్పోయిన నమ్మకాన్ని తిరిగి ఇచ్చాం. బిహార్ సంస్కృతి, సంప్రదాయాలను అవమానించే వారిని ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలి" అని ఆయన పిలుపునిచ్చారు. సీతామర్హిలో మోదీ సభకు భారీగా జనసంద్రం తరలివచ్చింది. నినాదాలతో సభా ప్రాంగణం మారోమ్రోగింది. మోదీ ప్రసంగానికి సమాధానంగా ప్రజలు 'జై శ్రీరాం', 'మోదీ మళ్లీ లాయేంగే' అంటూ గగ్గోలు పెట్టారు.ఎన్నికల ప్రచారం మరింత ఉత్కంఠగా మారగా, రెండో దశ పోలింగ్‌కి బిహార్ సిద్ధమవుతోంది. రాబోయే రోజుల్లో ఇతర ప్రాంతాల్లోనూ మోదీ పలు సభల్లో పాల్గొననున్నారు.



# ఘనంగా సీఎం రేవంత్ జన్మదిన వేడుకలు

**జగదేవపూర్ నవంబర్ 08 ప్రజాస్వరం**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు క్రాంతి కుమార్,యూత్ యువజన కాంగ్రెస్ బి సి సెల్ మండల అధ్యక్షులు లోకేష్ ,కొండ పోచమ్మ డైరెక్టర్ రాం రెడ్డి,స్థానిక కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు వెంకటేష్,నాయకులు గాల్ రెడ్డి,దయాకర్ రెడ్డి, మునీర్, మల్లికార్జున రెడ్డి, హనుమంత రెడ్డి, అమర రాము,వెంకటేష్,శ్రావణ్, ఆరీఫ్, బిలాల్,పలుగుగడ్డ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సీఎం పుట్టిన రోజు వేడుకలు

**నార్సింగి నవంబర్ 08 (ప్రజా స్వరం)**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు. మెదక్ జిల్లా నార్సింగ్ మండలంలోని వల్లూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ గ్రామ అధ్యక్షులు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అన్ని హామీలను నెరవేరుస్తూ రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ అభివృద్ధి వైపు దూసుకుపోతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు, గ్రామ ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు పిప్పిరి వినోద్ కుమార్ గుప్తా, యూత్ అధ్యక్షులు రాజు, యూత్ ఉపాధ్యక్షులు సుధాకర్, కాంగ్రెస్ నాయకులు పోచయ్య అశోక్ శ్రీకాంత్ స్వామి సిద్ధు నరేందర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా
# ఉచితవైద్య శిబిరం

- **టిపిసిసి చౌదరి సుప్రభాత్ రావు**

**రామాయంపేట. 08.( ప్రజా సర్వం)**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం శివాయిపల్లి గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాసాయిపేట మల్లేశం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని టిపిసిసి సభ్యులు చౌదరి సుప్రభాత్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి ప్రారంభించారు. ముఖ్యమంత్రి జన్మదిన పురస్కరించి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. నిరుపేదలకు పండ్లు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలని కోరుకుంటున్నాను తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే రోహిత్ రావ్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు చౌదరి సుప్రభాత్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాసాయిపేట మల్లేశం, మాజీ సర్పంచ్లు మహేందర్ రెడ్డి, శివ ప్రసాద్ రావు, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కుమార్ సాగర్. రామాయంపేట పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి అల్లడి వెంకటి. మహంకాళి దేవాలయ కమిటీ సభ్యులు దారం సంతోష్, మాజీ కౌన్సిలర్ చిలుక గంగాధర్, నాయకులు వినయ్ సాగర్, తదితరులు పాల్గొన్నారు





# మెదక్ సీఎస్ఐ పాస్నేట్ ఎన్నికలు

**మెదక్ నవంబర్ 08 (ప్రజా స్వరం)**

సిఎస్ఐ మెదక్ పాస్నేట్ ఎన్నికలు శనివారం మెదక్ జిల్లా కేంద్రం లోని సిఎస్ఐ చర్చ్ ప్రాంగణంలోని సండే స్కూల్ హాల్లో నిర్వహించడం జరిగింది. ఈ ఎన్నికలు మినిస్ట్రియల్ కమిషనరీ విల్సన్, డిసిసి వైస్ చైర్మన్ జేసు దాస్, ప్రెస్ బీటర్ ఇంచార్జీ శాంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ప్రాంగణం అంత సందడిగా మారిపోయింది. ఈ సందర్భంగా ప్రెస్ బీటర్ ఇంచార్జ్ శాంతయ్య మాట్లాడుతూ పాస్నేట్ ఎన్నికల్లో భాగంగా 20 మంది సభ్యుల ఎన్నిక కు, 3 సంవత్సరాల కాలపరిమితి తో సంఘానికి చెందిన సుమారు 1712 ఓట్లు ఉండగా మూడు ప్యానెల్స్ లో 60 మంది పోటీలో నిలవడం జరిగిందనీ అన్నారు. సంఘ సభ్యులు 20 మంది సభ్యులను ఎన్నుకునేందుకు సిద్ధపడ్డారని అన్నారు. ఈ ఎన్నికల ప్రెసెంటింగ్ ఆఫీసర్ గా పద్మారావు, జ్ఞాన ప్రసాద్, 50 మంది ఎన్నికల సిబ్బంది తో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు మధ్య ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు జరగకుండా ప్రశాంతమైన వాతావరణం లో ఎన్నికలు కొనసాగాయని అన్నారు. సభ్యుల ఎన్నిక అనంతరం నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.





# సైబర్ నేరాలు రోడ్డు భద్రత ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమం

- **ఆన్లైన్ మోసాలు, సోషల్ మీడియా మోసాలపై అవగాహన కలిగి**
- **ఎస్సై బాలరాజు**

**రామయంపేట. 08 (ప్రజా సర్వం)**

చిన్న చిన్న సమస్యలకు అతిగా ఆలోచించి, ఇతరులతో చర్చించకుండా ఆత్మహత్యలకు పాల్పడవద్దని రామాయంపేట ఎస్సై బాలరాజు యువతకు సూచించారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలో శనివారం పోలీసు కళాబృందం మేలుకొలుపు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కళాబృందం సభ్యులు సురేందర్ హాజరయ్యారు. ఇటీవల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవైనా సమస్యలు ఉంటే కుటుంబ సభ్యులు, స్నేహితులతో చర్చించాలని, అతిగా ఆలోచించి ఆత్మహత్యలకు పాల్పడవద్దని యువతకు సూచించారు. తమను నమ్ముకుని ఉన్న తల్లిదండ్రులకు గర్భశోకం మిగిల్చవద్దని సూచించారు. యువత సెల్ ఫోన్ లకు బానిసలు కావద్దని, మద్యం, డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణి



- **రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్**

**గజ్వేల్/ కొండపాక నవంబర్ 08 ప్రజాస్వరం**

అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా వారు ఎమ్మెల్సీ యాదవ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి గారి సహకారంతో వచ్చిన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులను పంపిణీ చేసిన వైస్ ఎంపీపీ రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ లకుడారం గ్రామానికి చెందిన రాచకొండ తేజస్వినికి 24500 రాచకొండ మనమ్మ కి 24000 మర్పడకు చెందిన ఎండి ముస్తఫా కు 16,500 అందజేశారు ఈ కార్యక్రమంలో దేవి నర్సింలు డాక్టర్ నరసింహులు కంకణాల నర్సింలు తదితరులు పాల్గొన్నారు



## రెండు కోట్ల 60 లక్షలతో
# బీటీ రోడ్డు నిర్మాణం

- **రోడ్డు నిర్మాణాకి అధికారుల సర్వే**

**రామయంపేట. 08 ( ప్రజా సర్వం )**

మెదక్ జిల్లా మెదక్ జిల్లా రామాయంపేట మండలం ప్రగతి ధర్మారంలో రోడ్డు నిర్మాణానికి అధికారులు శనివారం సర్వే నిర్వహించారు. గ్రామం నుంచి రఘుపతి గుట్ట దేవాలయం వరకు సుమారు రూ.2కోట్ల 60లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఎమ్మెల్యే రోహిత్ రావు సహకారంతో నిధులు మంజూరు కావడంతో నేడు అధికారులు సర్వే నిర్వహించారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



## జాతీయ కుటుంబ ప్రయోజన పథకం పై
# నిర్లక్ష్యం తగదు

**నిజాంపేట. 08.( ప్రజా సర్వం )**

కుటుంబ యజమాని మరణిస్తే తక్షణ ఆర్థిక సహాయం కింద 20వేల రూపాయలు కేంద్ర ప్రభుత్వం అందించే ఎఫ్ఎంబిఎస్ పథకంపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని డి బిఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ అన్నారు. నిజాంపేట మండలం లో శనివారం ప్రజలకు ఈ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కుటుంబ యజమాని 18 సంవత్సరాల వయసు నుండి 60 సంవత్సరాల వయసు లోపు వారు ప్రమాదవశాత్తు, సహజంగా మరణించిన వారి కుటుంబ సభ్యులు ఈ పథకానికి అర్హులు అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాన్ని మరణిస్తే ఆ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుందని 2017 నుండి మరణించిన వారి కుటుంబ సభ్యులు ఈ పథకానికి అర్హులని ప్రజలకు తెలిపారు. ఈ పథకంపై ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దుబాసి సంజీవ్, కోమ్మటబాబు, గరుగుల శ్రీను తదితరులు ఉన్నారు.



# విద్యుత్ ఘాతానికి గేదె మృతి

**దుబ్బాక నవంబర్ 08( ప్రజా సర్వం)**

దుబ్బాక మండలంలోని చెల్లాపూర్ గ్రామానికి చెందిన రైతు తొగుట నరేందర్ కుటుంబం దురదృష్టంలో మునిగిపోయింది. శనివారం రోజు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో వారి పాడి గేదె విద్యుత్ ఘాతానికి గురై మరణించింది.రైతు తొగుట నరేందర్ వ్యవసాయం చేసుకుంటూ చిన్న పిల్లలతో జీవనం సాగిస్తున్నారు. పాల కోసం సుమారు 80 వేల రూపాయలు పెట్టి కొద్ది రోజుల క్రితం బర్రెను కొనుగోలు చేశారు. ఆ గేదె పదిహేను రోజుల క్రితం ఒక ఆడ దూడకు జన్మనిచ్చింది. కాగా, కేవలం 15 రోజులకే ఆ గేదె మరణించడం వలన తోగుట నరేందర్ కుటుంబం తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంది.బాకీ తీసుకుని గేదెను కొనుగోలు చేసినందున ఇప్పుడు అప్పుల భారంతో ఆ కుటుంబం కష్టాల్లో పడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నరేందర్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.




# ముగిసిన 11 వ జోనల్ మీట్

**రామాయంపేట.08 ( ప్రజా సర్వం )**

గత మూడు రోజులుగా మెదక్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ మరియు కళాశాలలో జరుగుతున్న రాజన్న సిరిసిల్ల జోనల్ స్థాయి గేమ్స్ ముగింపు కార్యక్రమానికి మెదక్ డి.ఎస్.పి ప్రసన్న కుమార్ ముఖ్య అతిథి గా హాజరయ్యారు,గెలు పొందిన విద్యార్థినులకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ప్రిన్సిపాల్ లు పద్మావతి,సత్యవతి ,అనురాధ,సంధ్యారాణి,వర్గల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్,ఉపాధ్యాయులు,వివిధ స్కూల్ ల పి ఈ టి, పిడి, విద్యార్థిని, విద్యార్థులు, పాల్గొన్నారు.



# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**దౌల్తాబాద్,అక్టోబర్ 8 (ప్రజాస్వరం):**

మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేసి కొనుగోళ్లు ప్రారంభించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న కల్లాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారు లాలు మాట్లాడుతూ మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంలో పీఏసీఎస్ చైర్మన్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. చైర్మన్ కేవలం ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికే ప్రయత్నిస్తున్నారని, రైతుల మేలు కోసం ఏ చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని, అయితే చైర్మన్ నిర్లక్ష్యం కారణంగా ఇప్పటివరకు కేంద్రం ఏర్పాటు కాలేదని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనార్థం వెంటనే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. వారితో పాటు ఆత్మ కమిటీ డైరెక్టర్ సూరంపల్లి ప్రవీణ్,నాయకులు రైతన్న, లలిత కృష్ణ,పంజా రమేష్,కృష్ణ తదితరులున్నారు.






# లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి

**మేడ్చల్ నవంబర్ 8 (ప్రజాస్వరం) :**

ఈనెల 15వ తేదీన జరగబోయే ప్రత్యేక లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని అధిక కేసులు రాజి కుదుర్చుకోవాలని మేడ్చల్ ఎనిమిది, తొమ్మిదవ మెట్రోపాలిటన్ న్యాయమూర్తులు అన్నారు. జాతీయ న్యాయ సేవ దినోత్సవం పురస్కరించుకొని శనివారం మేడ్చల్ న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో పడాల రామిరెడ్డి న్యాయ కళాశాల అమీర్ పేట్ వారు మేడ్చల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో న్యాయ సేవ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మేడ్చల్ ఎనిమిది, తొమ్మిదవ మెట్రోపాలిటన్ న్యాయమూర్తులు అలేఖ్య, తిరుపతిలు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు విస్తృతంగా న్యాయ సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈనెల 15వ తేదీన జరగనున్న లోక్ అదాలత్లో సాధ్యమైనన్ని అధిక కేసులలో రాజీ కుదుర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చీదు హనుమంత్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, మాజీ అధ్యక్షుడు వేణు రాజు యాదవ్, పడాల రామిరెడ్డి కళాశాల చైర్మన్ పడాల శ్రీనివాస్, పలువురు న్యాయవాదులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



# కాళ్లకల్ లో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుక

**మనోహరబాద్ (ప్రజాస్వరం ) :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందని గజ్వేల్ నియోజకవర్గ సీనియర్ నాయకులు వీరబోయిన గోపాల్ ముదిరాజ్ అన్నారు. మెదక్ జిల్లా మనోహరబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పనులు చేపడుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజలను ఆదుకుంటున్న గొప్ప నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కొనియాడారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉంటూ ప్రజలకు సేవ చేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మండల ఐఎన్టీయూసీ మాజీ అధ్యక్షులు ఊట్ల సత్యనారాయణ, కాలకల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తకాపు శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, తుమ్మల రాజు, కమ్మరి వెంకటేశం, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కుమ్మరి మహేష్, ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

**దౌల్తాబాద్ నవంబర్ 8 (ప్రజాస్వరం):**

దౌల్తాబాద్ మండల పరిధిలోని ఉప్పరపల్లి -కోనయపల్లి గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి: పోసానిపల్లి గ్రామానికి చెందిన అబ్రమైన రాములు ద్విచక్ర వాహనంపై దౌల్తాబాద్ పట్టణం నుండి స్వగ్రామానికి వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన కారు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాముడి రెండు కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. మీప గ్రామస్థులు వెంటనే 108 అంబులెన్స్కు సమాచారం అందించగా, దౌల్తాబాద్ 108 బృందం గాయపడిన వ్యక్తిని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గిడ్డంగి గోదాం లేక కొనుగోలు కేంద్రాలు సాధ్యం కావు

- **చైర్మన్ అన్నా రెడ్డి వెంకటరెడ్డి**

**దౌల్తాబాద్, నవంబర్ 8 (ప్రజాస్వరం)**



దౌల్తాబాద్ మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేకపోవడానికి ప్రధాన కారణం గిడ్డంగి గోదాం మరియు ధాన్యం ఆరబెట్టేందుకు కావాల్సిన కళ్లం సౌకర్యం లేకపోవడమేనని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ అన్నారెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయమై సంబంధిత వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి సూచనలు జారీ చేసిన విషయం జిల్లా ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. అయితే దౌల్తాబాద్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం మాత్రమే ఉండి, కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేయడానికి గిడ్డంగి గోదాం లేకపోవడం, రైతులు ధాన్యం ఆరబెట్టేందుకు కళ్లం లేకపోవడం వలన ప్రస్తుతం కొనుగోలు కేంద్రం ఏర్పాటు సాధ్యంకాదని చెప్పారు. కొంతమంది రాజకీయ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తూ "చైర్మన్ అసమర్థుడు" అని మాట్లాడడం అనవసరమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన తరువాత రైతుల అవసరాల కోసం డీసీసీబీ బ్యాంకును తెప్పించడం, సంఘానికి నూతన భవన నిర్మాణం చేపట్టడం వంటి అభివృద్ధి పనులు జరిగాయని పేర్కొన్నారు. రైతుల సమస్యలపై నిజంగా ఆసక్తి ఉంటే దౌల్తాబాద్లో ధాన్యం ఆరబెట్టేందుకు కళ్లం ఏర్పాటు చేయాలని ఆయన సవాల్ విసిరారు. అదే కార్యక్రమంలో (బిఆర్ఎస్) మండల అధ్యక్షుడు సయ్యద్ రహీముద్దీన్ మాట్లాడుతూ, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానందుకు ప్రతిపక్ష ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డినే కారణంగా చూపడం కాంగ్రెస్ నాయకుల అవగాహనలేమని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతులు ఇస్తే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం తమ పార్టీ పూర్తి సహకారం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దేవేందర్, స్టీవెన్ రెడ్డి, స్వామి, శేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్

**మొదటిపేజీ తరువాయి**

నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు రూ.2,500, రైతులకు రూ.15,000, ఇవన్నీ మాటల్లోనే మిగిలిపోయాయి. ఇప్పుడు హామీలపై మాట్లాడక, బీజేపాపై, నాపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు'' అని వ్యాఖ్యానించారు. ''ప్రజల దృష్టి మళ్లించేందుకు రేవంత్ రెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. భారత రాష్ట్ర సమితి, బీజేపీ కలిసిపోయాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కూడా ఇలానే తప్పుడు వీడియోలు, ఫేక్ పోస్టులు వదిలి ప్రజలను తప్పుదోవ పట్టించారు. కానీ తెలంగాణ ప్రజలు ఇప్పుడు మేల్కొంటున్నారు'' అని ఆయన తెలిపారు. కిషన్రెడ్డి మాట్లాడుతూ - ''నేను తెలంగాణ కోసం పోరాడిన వ్యక్తిని. ఈ రాష్ట్ర అభివృద్ధిపై నాకు ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదు. రేవంత్రెడ్డి లేదా కేసీఆర్ అనుమతితో నేను పని చేయను. ప్రజలే మా పార్టీకి నిజమైన బలం. బీజేపా పాలనలో చిన్నపాటి అవినీతి ఆరోపణ కూడా లేదు. కానీ ఈ రెండు పార్టీలు - కాంగ్రెస్, బీఆర్ఎస్ - అవినీతి, కుటుంబ రాజకీయం, అధికారం కోసం హఠాత్తుగా చేతులు కలుపుతుంటాయి'' అని ధ్వజమెత్తారు. ''కాంగ్రెస్ హైకమాండ్కు భయపడి రేవంత్రెడ్డి, కేసీఆర్పై ఏ చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఆయన ప్రభుత్వం ఫెయిల్యూర్ ప్రభుత్వం. ప్రజలు దీనికి తగిన బుద్ధి చెబుతారు. తెలంగాణ అభివృద్ధి అంశంపై నాతో ఓపెన్ డిబేట్ చేయగల ధైర్యం ఉందా? కేసీఆర్, రేవంత్ ఇద్దరూ నా సమాధానాలు వినేందుకు సిద్ధంగా లేరు'' అని కిషన్రెడ్డి సవాల్ విసిరారు. తన పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేస్తూ - ''భారతీయ జనతా పార్టీ ఇచ్చిన హామీని ఎప్పుడూ నిలబెట్టుకున్న పార్టీ. సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, జాతీయ రహదారి ప్రాజెక్టులు, మిషన్ భగీరథకు నిధులు - ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం చేసినవే. తెలంగాణ కోసం మేము కట్టుబడి ఉన్నాం. రేవంత్ రెడ్డి మాత్రం మాటలు మాత్రమే చెప్పే సీఎం'' అని కేంద్ర మంత్రి కిషన్రెడ్డి వ్యాఖ్యానించారు.





# రేవంత్ రెడ్డి నన్ను తిట్టినప్పుడు కేసీఆర్ ఫోన్ చేసి ఆ మాట చెప్పారు: కేటీఆర్

- **రేవంత్ రెడ్డి ఒత్తిడిలో ఉన్నారని, ఓడిపోతున్నాడని తెలిసి నిరాశలో ఉన్నాడని కేసీఆర్ చెప్పారన్న కేటీఆర్**
- **సంయమనంతో మాట్లాడాలని కేసీఆర్ తనకు సూచించారన్న కేటీఆర్**

**హైదరాబాద్, ప్రజాస్వరం**

రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు చెబుతూనే, జూబ్లీహిల్స్ ఓటమి తర్వాతైనా మంచి పాలన అందించాలని చమత్కారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను దూషించినప్పుడు, తమ పార్టీ అధినేత కేసీఆర్ ఫోన్ చేసి, నువ్వు టెంప్ట్ కావొద్దని సూచించారు, దీంతో తాను ఏమీ అనలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. టీవీ9 ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు ఆసక్తి కర విషయాలను వెల్లడించారు.ఇటీవల జరిగిన ఒక సభలో రేవంత్ రెడ్డి తనను తీవ్రంగా దూషించారని, అది చూసిన కేసీఆర్ వెంటనే ఫోన్ చేసి మాట్లాడారని కేటీఆర్ చెప్పారు. రేవంత్ రెడ్డి తీవ్ర ఒత్తిడి లో ఉన్నారని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతో నిరాశలో ఉన్నందువల్ల అలా మాట్లాడుతున్నారని కేసీఆర్ తనకు చెప్పారని ఆయన అన్నారు. అందుకే, తాను కూడా అదే స్థాయిలో ప్రతిస్పందించవద్దని కేసీఆర్ సూచించారని కేటీఆర్ తెలిపారు. సంయమనంతో వ్యవహరించాలని కేసీఆర్ సలహా ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి తనను దూషించినందుకు మరుసటి రోజు తాను కూడా ఘాటుగా మాట్లాడాలనుకున్నానని, కానీ కేసీఆర్ సూచనతో సంయమనం పాటించానని కేటీఆర్ అన్నారు. ఇలాంటి విషయాల్లో అన్ని పార్టీల అధ్యక్షులు తమ పార్టీ నేతలను నియంత్రించాలని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. తనను కేసీఆర్ నియంత్రించినట్లుగానే, కాంగ్రెస్ పార్టీలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, బీజేపీలో రామచంద్ర రావు తమ పార్టీ నేతలను నియంత్రించాలని ఆయన అన్నారు. ఇలాంటి ధోరణుల వల్ల ప్రజలు రాజకీయ నాయకులను అసహ్యించుకునే పరిస్థితి వస్తుందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంచి సంప్రదాయానికి తమ పార్టీ తరపున పునాది వేస్తామని ఆయన అన్నారు. తనను విమర్శిస్తే సహిస్తానని, కానీ కేసీఆర్‌ను విమర్శిస్తే మాత్రం ఊరుకునేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

**రేవంత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఆయన ఐదేళ్లు ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరుకుంటున్నాను. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి తర్వాతైనా తెలంగాణలో మంచి పాలన అందించాలని ఆశిస్తున్నాను. ఆయన నిండు నూరేళ్ల ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను" అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఘనంగా సీఎం రేవంత్ జన్మదిన వేడుకలు

**గజ్వెల్ ప్రతినిధి (ప్రజాస్వరం)::**

జగదేవపూర్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి అష్టాయురాగ్యలతో నుండి నూరేళ్లు వర్ధిల్లాలని తెలంగాణ ప్రజలకు పరిపాలన మరింత చేరువ కావాలని మరో పదేండ్లు ముఖ్యమంత్రిగా అధిరోహించాలని తెలిపారు. అదేవిధంగా పదేండ్ల బీ ఆర్ యస్ పాలనలో జూబ్లీహిల్స్ అభివృద్ధి కుంటు పడిందని జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయంమని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు బత్తిని క్రాంతి కుమార్,యూత్ యువజన కాంగ్రెస్ బి సి సెల్ మండల అధ్యక్షులు లోకేష్ ,కొండ పోచమ్మ డైరెక్టర్ రాం రెడ్డి స్థానిక కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు వెంకటేష్ సీనియర్ నాయకులు గాల్ రెడ్డి దయాకర్ రెడ్డి సయ్యద్ మునీర్ మల్లికార్జున రెడ్డి, హనుమంత రెడ్డి,అమర రాము కేశిరెడ్డి కృష్ణ రెడ్డి మిట్టపల్లి వెంకటేష్ దండే వెంకటేష్ శ్రావణ్, ఆరీఫ్, బిలాల్ పలుగుగడ్డ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేష్ మచ్చ బిక్షపతి దశరథ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అనాధలుగా మారిన చిన్నారులకు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ చేయూత

- **రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన**
- **ఇద్దరు చిన్నారులుకు 1,20,000 సహాయం**
- **చిన్నారుల ఇంటికి వెళ్లి సహాయం అందించిన గొల్లపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్,**
- **సామాజిక సేవా దృక్పథం గల కందికొండ విగ్నేష్ గౌడ్**
- **మానవత్వాన్ని చాటుకున్న ఇద్దరినీ కొనియాడిన పలువురు**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (ప్రజాస్వరం):**

రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి ఆనాధలుగా మారిన ఇద్దరు చిన్నారులకు ఆర్థిక సహాయం చేశారు గొల్లపల్లి. మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, విగ్నేష్ గౌడ్. వికారాబాద్ జిల్లా యాలాల్ మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన బందెప్ప, లక్ష్మి లు చేవెళ్ల మండల పరిధిలోని మీర్జాగూడ వద్ద జరిగిన బస్సు టిప్పర్ డీకొన్న రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే చనిపోయారు. దీంతో వారికి చెందిన ఇద్దరు. చిన్నారులు ముక్యంగా అమ్మాయిలు ఆనాధలయ్యారు. వారికి భూమి కాని మారేమీ ఆస్తులు లేవు. చిన్నారులు రోడ్డున పడ్డారు. వారి దీన స్థితిని మీడియాలో చుసిన ప్రజలు కన్నీరు మున్నీరు అవుతున్నారు. ఈ సంఘటనను చేవెళ్ల న్యూస్ వేదికగా ఆ చిన్నారులను ఆదుకునే ప్రయత్నం చేయగా చాలా మంది ఆ చిన్నారులకు ఆర్థిక సహాయం చేశారు. ఇదే క్రమంలో చేవెళ్ల మండల మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లొంకా శ్రీనివాస్ గౌడ్, ఆ చిన్నారులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. అతని తో పాటు కందికొండ విఘ్నేష్ గౌడ్ 20 వేల ఆర్థిక సహాయంతో పాటు అలాగే రెండు. నెలల పాటు వారికి తినడానికి అవసరమయ్యే వాటిని అందించేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు శనివారం వీరిరివురు నేరుగా చిన్నారుల స్వస్థలమైన వికారాబాద్ జిల్లా యాలాల మండల పరిధిలోని హజీపూర్ గ్రామానికి వెళ్లి చిన్నారులకు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి ఎటువంటి ఆధారం లేని చిన్నారులను చూసి మనసు కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చిన్నారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అలాగే ప్రతి ఒక్కరూ చిన్నారులను ఆదుకునేందుకు ముందుకు రావాలని తోచిన సహాయం చెయలని విజ్ఞప్తి చేశారు. శ్రీనివాస్ గౌడ్, విఘ్నేష్ గౌడ్ లను నేటిజన్లు సోషల్ మీడియా ద్వారా వారి మనవత్వాన్ని అభినందనలతో కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఊరెళ్ళ మాజీ సర్పంచ్ ఎండి. జంగిర్, మహేష్ గౌడ్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

- **బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుతూ సంబరాలు**
- **మరో పదిఏండ్ల పాటు కాంగ్రెస్ దే అధికారం**
- **రేవంత్ పాలనలో తెలంగాణ భేష్**
- **చిన్నకోడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్**

**సిద్దిపేట, ప్రజాస్వరం :**

చిన్నకోడూరు మండల కేద్రం లో సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్బంగా చిన్నకోడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ అధ్యర్యంలో అంబేద్కర్ చౌరసస్థా లో బాణాసంచా కాల్చి అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్బంగా మీసం మహేందర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు ఆయురారోగ్యాలతో మరెన్నో జరుపుకుంటూ పది కాలాల పాటు చల్లగా ఉండాలని, తెలంగాణ ప్రజలకు సుభిక్షమైన పాలన అందించాలని ఆకాంక్షించారు అంతేకాకుండా రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రభుత్వంలో అమలయ్యే ఆరు గ్యారంటీలే వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టాం కడతారని, మరో పది ఏండ్లపాటు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని జోష్యం చెప్పారు ఈ కార్యక్రమంలో మండల ఉప అధ్యక్షులు సందబోయిన పర్షరాం, sc సెల్ మండల అధ్యక్షులు కొమ్ము ప్రశాంత్,ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, కిసాన్ సేల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాకాల భూపతిరెడ్డి,బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిక్కుడు అనిల్, ఫిషర్మెన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకట్ , యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు అంతగిరి చంద్రశేఖర్ చిన్నకోడూరు మండల్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎండి సలీం,ఎస్సీ సెల్ మాజీ మండల అధ్యక్షులు నముండ్ల వినోద్,చౌడారం గ్రామ శాఖ అధ్యక్షులు గొట్టిపర్తి చందు,కస్తూరిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు నక్కరాజు సీనియర్ నాయకులు పుచ్చకాయల వెంకట్ రెడ్డి,రామంచ గ్రామ శాఖ అధ్యక్షులు కొమ్మ ఎల్లయ్య,నర్సిలు చంద్లపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు కనకయ్య,అనుపాటి విజయ రెడ్డి, దూది ఎల్లారెడ్డి,దేవరాయ శేఖర్,చిన్నకోడూరు గ్రామ శాఖ అధ్యక్షులు గుడిమళ్ల మల్లేశం పాకాల లక్ష్మారెడ్డి, మేడిపల్లి అనిల్, మంద శ్రీకాంత్,భైరోజు రమేష్, తాళ్లపల్లి రాజు వెంకన్న.భాస్కర్ రాముని పట్ల గ్రామ శాఖ అధ్యక్షులు కర్రె మధు,ఓబులాపురం రాజు పాల్గొన్నారు



# 300 క్వింటాళ్ల పత్తి దగ్ధం.. బోరున విలపించిన రైతు కుటుంబం

- **300 క్వింటాళ్ల పత్తి దగ్ధం**
- **బోరున విలపించిన రైతు కుటుంబం**
- **బెజ్జంకి మండలంలో అగ్ని ప్రమాదం**
- **ఐలయ్య కుటుంబానికి పెద్ద నష్టం**

**తెలంగాణ బ్యూరో, (ప్రజాస్వరం)::**

రైతులు ఎంతో కష్టపడి పండించిన పత్తి పంట నిల్వ ఉంచిన చోటే ప్రమాదవశాత్తు మంటలకు ఆహుతైన విషాద ఘటన సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. సుమారు 300 క్వింటాళ్ల పత్తి పూర్తిగా కాలిపోవడంతో రైతు కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

**కౌలుకు తీసుకొని పత్తి సాగు..**

బెజ్జంకి గ్రామానికి చెందిన రైతు బండి ఐలయ్య, తన సొంత పది ఎకరాలతో పాటు మరికొంత భూమిని కౌలుకు తీసుకుని ఈ ఏడాది పత్తి సాగు చేశారు. కొద్ది రోజులుగా పత్తి తీత పనులు కొనసాగుతుండగా, ఇంటికి తెచ్చిన పత్తిని తడి ఆరేందుకు వీలుగా ఖాళీ స్థలంలో టార్పాలిన్లు వేసి ఆరబెట్టారు.

**ప్రమాదవశాత్తు మంటలు..**

శనివారం మధ్యాహ్నం, ఆరబెట్టిన పత్తికి ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. క్షణాల్లోనే మంటలు తీవ్రరూపం దాల్చి, పత్తి మొత్తం కాలి బూడిదైంది. రైతు ఐలయ్యతో పాటు ఆయన కుమారులు రమేశ్, అనిల్, ఇతర కుటుంబ సభ్యులు మంటలు గమనించి ఆర్పేందుకు తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. ఈ ఘటనలో సుమారు 300 క్వింటాళ్ల మేర పత్తి కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.

**కళ్లముందే కష్టం బూడిద..**

పత్తి రైతు ఐలయ్య కుటుంబం తమ కష్టం కళ్ల ముందే బూడిద పాలు కావడంతో, తీవ్ర ఆవేదనకు గురై బోరున విలపించింది. అగ్నిప్రమాదం కారణంగా తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ఘటనా స్థలాన్ని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ సౌజన్య పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.





## ఫ్రాంచైజీ కోసం త్యాగం.. రూ.4 కోట్ల జీతానికే 2026 ఐపీఎల్ ఆడనున్న ధోనీ!

- ఐపీఎల్ 2026 సీజన్‌లోనూ ఆడనున్న ఎంఎస్ ధోనీ
- చెన్నై సూపర్ కింగ్స్ తరపున బరిలోకి దిగనున్న 'తలా'
- 2025 మెగా వేలానికి ముందు రూ.4 కోట్లకే అన్‌క్యాప్డ్‌గా రిటైన్
- మూడేళ్ల కాంట్రాక్ట్ కారణంగా 2026లోనూ అదే జీతం
- గత రెండు సీజన్లుగా మోకాలి నొప్పితో బాధపడుతున్నా కొనసాగింపు
- ఫ్రాంచైజీ కోసం భారీ మొత్తాన్ని వదులుకున్న మిస్టర్ కూల్

**హైదరాబాద్, ప్రజాస్వరం:**

మహేంద్ర సింగ్ ధోనీ అభిమానులకు శుభవార్త. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లోనూ 'తలా' ఆడనున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ఫ్రాంచైజీ ఈ విషయాన్ని ధ్రువీకరించింది. దీంతో ధోనీ తన 19వ ఐపీఎల్ సీజన్‌లో బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. గత రెండు సీజన్లుగా మోకాలి నొప్పితో ఇబ్బంది పడుతున్నప్పటికీ, ఆయన ఆటపై చూపిస్తున్న అంకితభావం మరోసారి స్పష్టమైంది. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు ధోనీ ఒక సంచలన నిర్ణయం తీసుకున్నాడు. ఫ్రాంచైజీ ప్రయోజనాల కోసం తనను తాను అన్‌క్యాప్డ్ కేటగిరీలో కేవలం రూ.4 కోట్లకే రిటైన్ చేసుకునేందుకు అంగీకరించాడు. నిజానికి, అతడు వేలంలోకి వచ్చి ఉంటే రూ.20 కోట్లకు పైగా సంపాదించే అవకాశం ఉండేది. కానీ, సీఎస్కే పట్ల తనకున్న విధేయతను చాటుకున్నాడు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం, ఆటగాళ్లతో మూడేళ్ల కాంట్రాక్ట్ ఉంటుంది కాబట్టి, 2026 సీజన్‌లోనూ ధోనీ జీతంలో ఎలాంటి మార్పు ఉండదు. అతనికి రూ.4 కోట్లే అందనుంది. 2008లో సీఎస్కేతో ఐపీఎల్ ప్రస్థానం ప్రారంభించిన ధోనీ, మధ్యలో రెండేళ్లు (సీఎస్కేపై నిషేధం సమయంలో) రైజింగ్ పుణె సూపర్ జెయింట్‌కు ఆడాడు. 2018లో తిరిగి చెన్నై గూటికి చేరి అప్పటి నుంచి జట్టుతోనే కొనసాగుతున్నాడు. ఒకప్పుడు ఐపీఎల్‌లో అత్యధిక పారితోషికం అందుకున్న ఆటగాళ్లలో ఒకడిగా ఉన్న ధోనీ, ఇప్పుడు అత్యంత తక్కువ జీతం తీసుకుంటున్న దిగ్గజ ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. అతని నాయకత్వంలో సీఎస్కే ఐదుసార్లు (2010, 2011, 2018, 2021, 2023) టైటిల్ గెలుచుకుంది. కెప్టెన్‌గా 221 ఐపీఎల్ మ్యాచ్‌లలో 131 విజయాలు అందించి జట్టును విజయవంతంగా నడిపించాడు. ఫ్రాంచైజీపై ధోనీకి ఉన్న అంకితభావానికి ఇది నిదర్శనమని, అతను పసుపు జెర్సీలోనే తన కెరీర్‌కు వీడ్కోలు పలుకుతాడనడంలో ఎలాంటి సందేహం లేదని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




## మహిళల క్రికెట్ సరికొత్త చరిత్ర.. వ్యూయర్‌షిప్‌లో పురుషులతో సమం

- మహిళల క్రికెట్‌కు అపూర్వ ఆదరణ
- వరల్డ్ కప్ ఫైనల్‌కు 185 మిలియన్ల వ్యూయర్‌షిప్
- పురుషుల టీ20 ప్రపంచకప్ ఫైనల్‌తో సమానమైన వీక్షణలు
- టోర్నీ మొత్తం డిజిటల్ రీచ్ 446 మిలియన్లు
- గత మూడు ప్రపంచకప్‌ల రికార్డులను అధిగమించిన గణాంకాలు

**హైదరాబాద్, ప్రజాస్వరం :**

మహిళల క్రికెట్‌కు ప్రజాదరణ ఏ స్థాయిలో పెరిగిందో ఇటీవలి ప్రపంచకప్ ఫైనల్ వీక్షకుల సంఖ్య స్పష్టం చేస్తోంది. హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత మహిళల జట్టు తొలిసారి వన్డే ప్రపంచకప్ గెలిచిన చారిత్రక ఫైనల్ మ్యాచ్, ఏకంగా 185 మిలియన్ల వ్యూయర్‌షిప్‌ను సాధించి సంచలనం సృష్టించింది. ఈ సంఖ్య 2024లో రోహిత్ శర్మ సారథ్యంలోని పురుషుల జట్టు గెలిచిన టీ20 ప్రపంచకప్ ఫైనల్ వీక్షకుల సంఖ్యతో సమానం కావడం విశేషం. దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించి కప్ కైవసం చేసుకున్న ఈ ఫైనల్ మ్యాచ్‌కు అసాధారణమైన ఆదరణ లభించింది. పురుషుల క్రికెట్‌తో సమానంగా మహిళల క్రికెట్ కూడా వీక్షకులను ఆకట్టుకుంటోందని ఈ గణాంకాలు నిరూపిస్తున్నాయి. ఇది మహిళల క్రికెట్ ప్రజాదరణలో ఒక మైలురాయిగా నిలుస్తోంది. కేవలం ఫైనల్ మ్యాచ్ మాత్రమే కాదు, మొత్తం టోర్నమెంట్‌కు కూడా భారీ స్పందన వచ్చింది. ఈ టోర్నమెంట్ మొత్తం డిజిటల్ రీచ్ 446 మిలియన్లకు చేరింది. ఈ సంఖ్య గత మూడు ఐసీసీ మహిళల ప్రపంచకప్‌ల మొత్తం రీచ్ కంటే ఎక్కువ కావడం గమనార్హం. అంతే కాకుండా నవంబర్ 2న భారత జట్టు చారిత్రక ట్రోఫీని అందుకుంటున్న క్షణంలో గరిష్ఠంగా 21 మిలియన్ల మంది వీక్షించారు. ఈ అద్భుతమైన గణాంకాలు మహిళల క్రికెట్‌లో ఒక కొత్త శకానికి నాంది పలుకుతున్నాయని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.





## ఆట కంటే ఏ ఆటగాడూ గొప్ప కాదు.. కోహ్లీ, రోహిత్‌పై స్టీవ్ వా కీలక వ్యాఖ్యలు

- రోహిత్, కోహ్లీల కెరీర్ చివరి దశలో ఉందని వ్యాఖ్య
- ఎవరూ శాశ్వతం కాదని, వారి స్థానంలో మరొకరు వస్తారన్న స్టీవ్ వా
- ఆటగాళ్ల భవిష్యత్తుపై సెలక్టర్లదే తుది నిర్ణయం కావాలన్న ఆసీస్ దిగ్గజం
- ఆటగాళ్లతో సెలక్షన్ కమిటీ ఛైర్మన్ కొంత దూరం పాటించడం మంచిదని సూచన
- సీనియర్లతో చర్చలు జరపడం కూడా ముఖ్యమేనని వెల్లడి

**హైదరాబాద్, ప్రజాస్వరం :**





భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డే భవిష్యత్తుపై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా కీలక వ్యాఖ్యలు చేశాడు. ఆట కంటే ఏ ఆటగాడూ గొప్ప కాదని, ఈ నిజాన్ని ఆటగాళ్లు గ్రహించాలని ఆయన సూటిగా చెప్పాడు. కెరీర్ చివరి దశలో ఉన్న ఇలాంటి దిగ్గజాల విషయంలో సెలక్షన్ కమిటీ కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డాడు. ఒక యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్టీవ్ వా మాట్లాడుతూ.. "ఆటగాళ్లు కొంత బాధ్యత తీసుకోవాలి. ఆట కంటే తాము గొప్ప అని ఎప్పుడూ అనుకోకూడదు. ఎవరూ శాశ్వతం కాదు. వారి స్థానంలో మరొకరు వస్తారనే వాస్తవాన్ని గ్రహించాలి. ఆటను ఆటగాళ్లు శాసించలేరు. అంతిమంగా జట్టు ప్రయోజనాల దృష్ట్యా సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌దే తుది నిర్ణయం కావాలి" అని స్పష్టం చేశాడు. ప్రస్తుతం విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ తమ అంతర్జాతీయ కెరీర్ చివరి అంకంలో ఉన్నారు. ఇప్పటికే టీ20, టెస్ట్ ఫార్మాట్ల నుంచి తప్పుకున్న ఈ ఇద్దరూ కేవలం వన్డేలకు మాత్రమే పరిమితమయ్యారు. రెండేళ్లలో జరగనున్న 2027 ప్రపంచకప్ నాటికి కోహ్లీకి 39, రోహిత్‌కు 40 ఏళ్లు నిండుతాయి. దీంతో వారి ఫిట్‌నెస్, ఫామ్ చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ ఒక సెంచరీ, ఒక అర్ధ సెంచరీతో టాప్ స్కోరర్‌గా నిలవగా, వరుసగా రెండు డకౌట్ల తర్వాత చివరి మ్యాచ్‌లో కోహ్లీ 74 పరుగులతో రాణించాడు. ఈ నేపథ్యంలో భారత సెలక్టర్లకు స్టీవ్ వా కొన్ని ముఖ్యమైన సూచనలు చేశాడు. "సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్నవారు ఆటగాళ్లతో మరీ సన్నిహితంగా ఉండకూడదు. కొంత దూరం పాటించినప్పుడే కఠినమైన నిర్ణయాలు స్వేచ్ఛగా తీసుకోగలరు. అజిత్ అగార్కర్ ఆటగాళ్లతో మంచి సంబంధాలు కలిగి ఉండాలి. కానీ, అదే సమయంలో అవసరమైన దూరం కూడా పాటించాలి. కోహ్లీ, రోహిత్ వంటి అనుభవజ్ఞులతో వారి భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడటం చాలా ముఖ్యం. కానీ, జట్టు కోసం ఏది మంచిదో ఆ నిర్ణయం తీసుకునే అధికారం మాత్రం సెలక్టర్‌కే ఉండాలి" అని పేర్కొన్నాడు.

## ఫైనల్‌లో షఫాలీ ఆట నాకు ఆశ్చర్యం కలిగించలేదు

- షఫాలీ వర్మను నిలువరించలేమని ముందే గ్రహించానన్న లానింగ్
- కొన్నేళ్లుగా ఆమె దూకుడైన క్రికెట్ ఆడుతోన్న లానింగ్
- ఫైనల్ మ్యాచ్‌లో ఆమె ఇన్నింగ్స్ కొంత చూశానన్న లానింగ్

**హైదరాబాద్, ప్రజాస్వరం:**

2025 మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్లో షఫాలీ వర్మ అద్భుత ప్రదర్శన పట్ల తనకు ఏమాత్రం ఆశ్చర్యం కలగలేదని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మెగ్ లానింగ్ పేర్కొంది. తన సాధారణ శైలిలోనే మంచి షాట్లు ఆడుతున్న ఆమెను నిలువరించలేమని తాను ముందే గ్రహించానని తెలిపింది. ఆస్ట్రేలియాతో జరిగిన సెమీ ఫైనల్‌కు ముందు గాయపడిన ప్రతికా రావల్ స్థానంలో షఫాలీ జట్టులోకి వచ్చింది. నవంబర్ 2న డివై పాటిల్ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆమె అద్భుత ప్రతిభ కనబరిచింది. స్మృతి మంధనతో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆమె 78 బంతుల్లో 87 పరుగులు చేసింది. భారత మహిళా క్రికెట్ జట్టు మొదటిసారి ప్రపంచ కప్‌ను గెలుచుకోవడంలో షఫాలి వర్మ అద్భుత ప్రదర్శన కీలకపాత్ర పోషించింది. "షఫాలీ కొన్ని సంవత్సరాలుగా దూకుడైన క్రికెట్ ఆడుతోంది. ఫైనల్ మ్యాచ్‌లో ఆమె ఇన్నింగ్స్‌ను కొంత వరకు చూశాను. ఆమె ప్రదర్శన చూశాక ఆమెను నిలువరించడం కష్టమని అప్పుడే భావించాను" అని మెగ్ లానింగ్ అన్నది. ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్, ఆల్ రౌండర్ దీప్తి శర్మను కూడా ఆమె ప్రశంసించింది. దీప్తి శర్మ బ్యాట్, బంతితో ఆటను ప్రభావితం చేసిందని తెలిపింది. ఇప్పుడు భారత జట్టుకు దీప్తి శర్మ కీలక క్రికెటర్‌గా మారిందని చెప్పింది. సెమీ ఫైనల్లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 127 పరుగులతో అజేయంగా నిలిచిన జెమీమా రోడ్రిగ్స్‌పై కూడా ప్రశంసలు కురిపించింది.



## హాంగ్‌కాంగ్ సిక్సెస్‌లో భారత్‌కు వరుసగా రెండో ఓటమి.. మనోళ్లను చిత్తు చేసిన కువైట్, యూఏఈ

- యూఏఈ చేతిలో 4 వికెట్ల తేడాతో ఓడిన భారత జట్టు
- భారత్ నిర్దేశించిన 108 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన యూఏఈ
- అంతకుముందు బ్యాటింగ్‌లో రాణించిన అభిమన్యు మిథున్, దినేశ్ కార్తీక్
- చివరి ఓవర్లో సిక్సర్‌తో యూఏఈకి విజయాన్ని అందించిన మహమ్మద్ అర్ఫాన్
- ఇప్పటికే కువైట్ చేతిలో ఓడిపోయిన భారత్‌కు ఇది మరో పరాజయం

**హైదరాబాద్, ప్రజాస్వరం:**

హాంగ్‌కాంగ్ సిక్సెస్ 2025 టోర్నమెంట్‌లో భారత జట్టు పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) చేతిలో భారత్ 4 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో చివరి ఓవర్లో యూఏఈ విజయాన్ని అందుకుంది. ఈ టోర్నీలో భారత జట్టుకు ఇది వరుసగా రెండో పరాజయం. భారత్ నిర్దేశించిన 108 పరుగుల లక్ష్య ఛేదనలో యూఏఈకి అద్భుతమైన ఆరంభం లభించింది. ఓపెనర్లు ఖలీద్ షా, సఘీర్ ఖాన్ తొలి రెండు ఓవర్లలోనే 42 పరుగులు జోడించి జట్టు విజయానికి బలమైన పునాది వేశారు. ఆ తర్వాత భారత బౌలర్లు పుంజుకున్నప్పటికీ, చివర్లో మహమ్మద్ అర్ఫాన్ చెలరేగాడు. మ్యాచ్ ముగియడానికి ఒక బంతి మిగిలి ఉండగా భారీ సిక్సర్ కొట్టి యూఏఈకి చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. భారత బౌలర్లలో స్టువర్ట్ బిన్నీ, భరత్ చిప్లీ తలో రెండు వికెట్లు తీశారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన భారత్, నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. అభిమన్యు మిథున్ 50 పరుగులతో అద్భుతంగా రాణించగా, దినేశ్ కార్తీక్ 42 రన్స్‌తో అతనికి చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరి మెరుపులతో భారత్ పోరాడగలిగే స్కోరు సాధించినా, బౌలర్లు దానిని కాపాడటంలో విఫలమయ్యారు. ఈ టోర్నీలో కువైట్ చేతిలో 27 పరుగుల తేడాతో ఓడిపోయిన భారత్, ఇప్పుడు యూఏఈ చేతిలోనూ ఓడిపోవడంతో అభిమానులు నిరాశ చెందారు.



## ఒలింపిక్స్‌లో దాయాదుల పోరు అనుమానమే.. ఐసీసీ కొత్త నిబంధనతో పాక్‌కు కష్టాలు

**హైదరాబాద్, ప్రజాస్వరం :**



అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్‌పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజే వేరు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఈ మ్యాచ్ కోసం ఎదురుచూస్తుంటారు. అయితే, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో ఈ దాయాదుల పోరును చూడాలనుకుంటున్న అభిమానులకు నిరాశ ఎదురయ్యేలా ఉంది. ఐసీసీ ప్రకటించిన నూతన అర్హత నిబంధనలే ఇందుకు కారణం. దుబాయ్‌లో శుక్రవారం జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దీని ప్రకారం ఒలింపిక్స్‌లో పాల్గొనే జట్లను ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ ఆధారంగా కాకుండా ఖండాలు లేదా రీజియన్ల వారీగా ఎంపిక చేయనున్నారు. ప్రతి రీజియన్‌లోని అగ్రశ్రేణి జట్టుకు ఒలింపిక్స్‌లో ఆడే అవకాశం లభిస్తుంది. ఆరో జట్టును గ్లోబల్ క్వాలిఫయర్ ద్వారా నిర్ణయిస్తారు. ప్రస్తుతం టీ20 ర్యాంకింగ్స్‌లో భారత్ నంబర్ 1 స్థానంలో ఉండగా, ఆసియా రీజియన్‌లో కూడా అగ్రస్థానంలో ఉంది.

ఈ విధానం ప్రకారం ఆసియా నుంచి అగ్రశ్రేణి జట్టుగా ఉన్న భారత్ నేరుగా అర్హత సాధించే అవకాశం ఉంది. అలాగే ఓషియానియా నుంచి ఆస్ట్రేలియా, యూరప్ నుంచి ఇంగ్లండ్, ఆఫ్రికా నుంచి దక్షిణాఫ్రికా జట్లు ఎంపికయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత నిబంధనల ప్రకారం ఆసియా నుంచి ఒకే జట్టుకు అవకాశం ఉండటంతో పాకిస్థాన్‌కు మార్గం దాదాపు మూసుకుపోయినట్లే. ఒకవేళ ఆసియా నుంచి రెండు జట్లకు అవకాశం కల్పిస్తే లేదా గ్లోబల్ క్వాలిఫయర్స్‌లో గెలిస్తే తప్ప పాకిస్థాన్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం కష్టమే. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో పురుషుల, మహిళల విభాగాల్లో ఆరేసి జట్లు పాల్గొంటాయని, మొత్తం 28 మ్యాచ్‌లు జరుగుతాయని ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది. ఆతిథ్య దేశం అమెరికాకు నేరుగా ప్రవేశం కల్పిస్తారా? లేక వెస్టిండీస్‌కు అవకాశం ఇస్తారా? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ క్రీడలు 2028 జులై 12న ప్రారంభం కానున్నాయి. గ్లోబల్ క్వాలిఫయర్, ఆతిథ్య దేశం కోటాపై త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఐసీసీ తెలిపింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999